క్లుప్తంగా

ఉత్తమ సేవలకు గుర్తింపు


డాక్టర్ పావనికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

బూర్జ: మండలంలోని బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.పావనికి బెస్ట్ డాక్టర్ అవార్డును జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం అందజేశారు. విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలు అందజేసినందుకు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పావనికి బూర్జ పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి జి.రాజశేఖర్, సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్ వైజర్లు లఖినాన సరోజిని, టి.తేజారావు, హెల్త్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కళాకారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న త్రినాథరావు

ఆమదాలవలస: కళాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టీకే త్రినాథరావు కోరారు. ఆదివారం పట్టణ పరిధిలోని గేదెలవానిపేట వద్ద కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ కళలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కళలు జనాన్ని జాగృతం చేస్తాయన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బాగాది వెంకటరావు మాట్లాడుతూ.. సంఘంలోని కళాకారులందరూ సభ్యులుగా చేరి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కళాకారుల సంఘం సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, పేడాడ ధనుంజయరావు, డి.లక్ష్మణరావు, కాగితాపల్లి సంజీవరావు, సంఘ గౌరవాధ్యక్షుడు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి కొంచాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోరు బాగుచేశారు


ఆస్పత్రి ఆవరణలో పనిచేస్తున్న బోరు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న మంచినీటి బోరు పనిచేస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు దీనిని వినియోగించుకుంటున్నారు. నవంబర్ 21న 'బోరుబాగు చేయరూ' అనే వార్త సాక్షిలో ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది స్పందించి బోరును బాగు చేశారు. నాలుగు రోజులుగా బోరు పని చేస్తోంది.

గంజాయితో పట్టుబడితే కఠిన చర్యలు


నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నరసన్నపేట: మాదక ద్రవ్యాలను విక్రయాలు చేయడం నేరమని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు హెచ్చరించారు. గంజాయి, ఖైనా, గుట్కా వంటి పదార్థాలు విక్రయించి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్‌తో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కాంప్లెక్స్‌లో బస్సులతోపాటు అన్ని షాపులు, ప్రయాణికుల బ్యాగుల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోలాకి మండల కేంద్రంలో..

పోలాకి: గంజాయి పట్టివేతకు ఇకపై డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పోలాకి మండల కేంద్రంలో ఎస్ఐ రంజిత్ సమక్షంలో పలు దుకాణాలు, వాహనాలను తనిఖీ చేశారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

కొత్తూరు: హిందూ దేవాలయాలను రక్షించుకునేందుకు విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న 'హైందవ శంఖారావం' విజయవంతం చేయాలని ఆర్ఆర్ఎస్ విభాగ్ కార్యనిర్వాహకుడు డి.రమణమూర్తి పిలుపునిచ్చారు. కొత్తూరులో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రమణమూర్తి మాట్లాడుతూ దేవాలయాలను పరిరక్షించుకునేందుకు హిందువులు ఐక్యతను చాటాలని కోరారు. లోతుగెడ్డ తాతబాబు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: కుంటిభద్ర కాలనీ వద్ద నేలకొరిగిన వరి చేను


మెళియాపుట్టి: పట్టుపురం వద్ద కళ్లంలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు


ఆమదాలవలస: లక్ష్మిడిపేటలో వరి కుప్పలున్న పొలంలో చేరిన వర్షం నీరు

రైతుకు కష్టం


నరసన్నపేట: కంబకాయ కూడలి వద్ద సర్వీస్ రోడ్డుపై నిల్వ చేసిన ధాన్యాన్ని చూసుకుంటున్న రైతు


పాతపట్నం: తెంబూరు వద్ద వర్షానికి తడుస్తున్న వరి పనలు

● ఫెంగల్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ● పలుచోట్ల తడిచిన వరి పనలు, కుప్పలు ● కొన్నిచోట్ల కోతలు, కళ్లాల్లోనే ధాన్యం ● రాత్రంతా కళ్లాల్లోనే రైతులు

ఫెంగల్ తుఫాన్ కారణంగా శని, ఆదివారాల్లో పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో వర్షం కురుసింది. చేతికి అందివచ్చిన వరి పంట నీటిపాలవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలావరకు పంటలు తడిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. వరి కోతలు కొంతమేర ఉండిపోయాయి. చాలావరకు ధాన్యం కళ్లాల్లోనే ఉన్నాయి. కళ్లాల్లో నిల్వ చేసి ధాన్యం, పంట పొలాల్లో ఉన్న వరి కుప్పలు తడిచిపోయాయి. కొద్దిపాటి ధాన్యమైనా కాపాడుకునే ప్రయత్నంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తడిచిన ధాన్యం కొనడానికి మిల్లర్లు ముందుకు రారని, కొన్నా తగినంత ధర రాదని ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులకు రైతులు పంటను కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట వివరాలు (ఎకరాల్లో) ఇలా..

నియోజకవర్గం	ఖరీఫ్ విస్తీర్ణం	రైతులు
పాతపట్నం	34,642	56,078
ఆమదాలవలస	41,157	38,520
నరసన్నపేట	70,280	54,498

ఆరబెట్టి విక్రయిస్తేనే మద్దతు ధర

ప్రస్తుత పరిస్థితుల్లో పొలాల్లో నీరు ఉంటే వరి కంకులు నేలవాలిపోతాయి. ఇప్పటికే కొన్నిచోట్ల నేలవాలిపోయాయి. వర్షంలో తడిచిన ధాన్యం మొలకలొచ్చే అవకాశం ఉంది. 17 శాతం కంటే ఎక్కువ తేమ శాతం వస్తే మద్దతు ధర కూడా పలకదు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటకు కనీస మద్దతు ధర రాకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతారు. తేమ శాతం 17 శాతం లోపు వచ్చేవరకు ఆరబెట్టి విక్రయించయాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

నష్టం వాటిల్లింది

తుఫాన్ కారణంగా వరి కోత నిలుపుదల చేశాను. వరి చేను పడిపోయింది. వర్షానికి వరి చేను తడిచిపోవడంతో మొక్కలు వచ్చే ప్రమాదం ఉంది. ఇంత వరకు కోత చేసి, నూర్పిడి చేసి ధాన్యాన్ని కళ్లంలో తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పి ఉంచాం.

- లోతుగెడ్డ శ్రీనివాసరావు, రైతు, కొత్తూరు


బూర్జ: పొలంలో వరి చేను కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతు


ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట వద్ద జొన్న పొలంలో చేరిన వర్షం నీరు


సారవకోట: రోడ్డుపై నిల్వ చేసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పి ఉంచిన రైతు


సరుబుజ్జిలి: పురుషోత్తపురం వద్ద వరి కుప్పలకు రక్షణగా చీరెలు కట్టిన రైతులు

హామీలు మరిచి పేదలపై బాదుడు

- విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై ఆర్థిక భారం మోపడం తగదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్


విలేకరులతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయి ఇప్పుడు విద్యుత్ చార్జీల పేరిట బాదుడే బాదుడు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఐదు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీల పేద, మధ్య తరగతి వర్గాలమీదే కాకుండా ఇతర రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూరగాయల నుంచి నిత్యావసర వస్తువుల వరకు అన్ని ధరలు పెరిగాయని గుర్తు చేశారు.

హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు నెలవారీ రూ. 1500 ఆర్థిక సాయం, 50 ఏళ్ల దాటిన వారికి పింఛన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం ఇంతవరకూ లేదని విమర్శించారు. తమపై కక్ష సాధింపులు ఆపి హామీల అమలుకు ప్రయత్నించాలని తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే కక్ష సాధింపులు చేస్తూ మీ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోండి అని కృష్ణదాస్ అన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి,నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో ఆదివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావుకు ఎమ్మెల్యే ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీల లబ్ధిదారులు మార్చి నెలాఖరుకి నిర్మాణాలు పూర్తి చేయకపోతే బిల్లులు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ఏఓ ఎస్.శ్రీనివాసరావు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పలు శాఖల అధికారులు, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ ఆనెపు రామకృష్ణనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏకపక్షంగా పింఛన్ల తొలగింపు

సరుబుజ్జిలి: ఇస్కలపాలెం పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా వృద్ధాప్య పింఛన్లు తొలగించడం అధికారుల ఏకపక్ష నిర్ణయాలకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేత, ఆమదాలవలస మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బద్రి రామారావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సుబ్బపేట, పెద్ద సవలాపురం గ్రామాల్లో 8 మంది వృద్ధులకు పింఛన్ తొలగించారన్నారు. అధికారులు అందించిన 3 నోటీసులకు హాజరైనప్పటికీ.. డిసెంబర్‌కు సంబంధించిన పింఛన్ నిలుపుదల చేశారన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో కొంతమంది దివ్యాంగ పింఛన్ పొందుతున్నవారిని, వారివి తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇద్దరు అన్నదమ్ముల్లో చిన్నవాడికి వృధ్యాప్య పింఛన్ అందించి, పెద్దవాడికి నిలుపుదలచేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారుల తీరు మారకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

మార్మోగిన రామనామం


సత్సంగంలో పాల్గొన్న భక్తులు, వక్తలు

పొందూరు: మండలంలోని లైదాం గ్రామంలోని శివానంద ధర్మక్షేత్రంలో ఆదివారం పోలిపాడ్యం సందర్భంగా సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటబొమ్మాళికి చెందిన 11 మంది భక్తులు వచ్చి శ్రీరామదీక్షను తీసుకున్నారు. సత్సంగంలో రాముని గొప్పతనాన్ని, వైభవాన్ని, రామ నామ శక్తిని వివరించారు. వక్తలు అనంత రామకృష్ణ, యాలాల శ్రీనివాసరావు, ఎన్వీ రమణ, హరికృష్ణ, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని, ఇది ప్రజలను దగా చేయటం కాదా అని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దీపావళి కానుకగా ఒకసారి, డిసెంబరు 1 నుంచి రెండోసారి కలిపి రూ.15,400 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. రెండుసార్లు కలిపి ఒక్కో యూనిట్‌పై అదనంగా రూ.2.19 పైసలు పెరిగిందన్నారు. 2019–2024 మధ్య మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టారన్నారు. 2019 నాటికి చంద్రబాబు డిస్కమ్‌లను రూ.86 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, 2014–19 మధ్య విద్యుత్ రుణ భారం 23.88 శాతం పెరిగిందన్నారు. 2019–24 మధ్య రుణ భారాన్ని 7.28 శాతానికి జగనన్న ప్రభుత్వం తగ్గించిందన్నారు. ఇప్పటికే అన్ని నిత్యావసరాల ధరలు పెరిగాయని, ఇప్పుడు విద్యుత్ చార్జీలు ఇంత భారీగా పెంచటంతో సామాన్యుడిపై తీవ్రప్రభావం చూపుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలపై దుష్ప్రచారం చేసిన ఎల్లో మీడియా, ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపితే కనీసం స్పందించక పోవటం వారి స్వామి భక్తికి నిదర్శనమన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక రోజూ జగనన్నని తిట్టడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని, ఇదంతా 'బాబు ష్యూరిటీ-వీర బాదుడు గ్యారెంటీ'లా ఉందన్నారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, నాయకులు మామిడి రమేష్, అన్నెపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ పులి!


బోరుభద్ర గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

పాతపట్నం: మండలంలోని బోరుభద్ర సమీపంలో పులి కనిపించినట్లు అటవీశాఖ అధికారులకు ఆదివారం రాత్రి గ్రామస్తులు సమాచారం అందజేశారు. ఫారెస్ట్ అధికారులు గ్రామానికి చేరుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులు ఎవరూ రాత్రి సమయంలో బయటకు, ఉదయం వాకింగ్‌కు వెళ్లొద్దని దండోరా వేయించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం సారవకోట మండలం సోడసముద్రం కొండపై పులి ఉందని అంచనా వేస్తున్నామన్నారు. దిశ మార్చి పాతపట్నం మండలం వైపు రావచ్చన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

పాతపట్నం: విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో గల పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డెన్ ఝాన్సీ, పోలీసులు పాల్గొన్నారు.


పోలాకి: రెడ్ రిబ్బన్ ఆకారంలో గంగివలస కేజీబీవీ విద్యార్థినులు

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది, అధికారులు హెచ్ఐవీ ఎలా సోకుతుంది.. వైరస్ సోకిన తర్వాత వచ్చే ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, రక్త మార్పిడి ద్వారా వైరస్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. - సాక్షి నెట్‌వర్క్


నరసన్నపేట: రిబ్బన్ ఆకారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


జలుమూరు: నినాదాలు చేస్తున్న జలుమూరు పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు


పాతపట్నం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పాతపట్నం సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది